# పిల్లలు

శ్రీనివాస ఫణికుమార్ . డొక్కా

అదేమిటో, ఈమధ్యన పిల్లల్ని ఒకసారి చూడాలనే కోరిక పెరిగిపోతోంది. ఆఫీసులో పనిలేకుండా తీరికగా వున్న ప్రతిసారీ ఎందుకో మనసు పిల్లలవైపు పోతోంది. బస్టాపులో బస్సుకోసం నిలబడ్డపుడు కూడా యిదే పరిస్థితి.

పెద్దాడు వెళ్ళి నాలుగేళ్ళయింది. రెండోవాడు వెళ్ళి రెండేళ్ళయింది.
ఏంచేస్తున్నారో? ఎలావున్నారో??
వారం వారం ఫోనులు చేస్తారు. వాళ్ళమాటలు వినగానే, ఎంతో దగ్గరగా యిక్కడే ఎక్కడో వున్నారనిపిస్తుంది. కానీ కంటికి కనపడరు.
మీకేమిటండీ, మహారాజులాగ ఇద్దరు పిల్లల్ని అమెరికా పంపించేశారు, దర్జాగా కాలుమీద కాలేసుకు కూర్చోక--, అటూంటారు అందరూ. కానీ వాళ్ళకేం తెలుసు నాబాధ. పిల్లలు వెళ్ళిపోయాక నా బలమంతా ఎవరో లాగేసుకున్నట్లు అనిపిస్తోంది.

నేను చాలా తప్పు చేశాననిపిస్తోంది. నిజమా? కాదనే అనిపించింది నాకు (అప్పుడు). అగ్రికులంలో పుట్టిన మధ్యతరగతి వాడికి యీ దేశంలో అడుక్కునేందుకు కూడా అవకాశం దొరకటంలేదు.
స్వప్రతిభతో వుద్యోగాలు రావడంమాట అటుంచి కనీసం చదువుకొనేందుకైనా వీలులేకుండాపోతోంది.
-ఎం.సి.ఎ లో నాకు స్టేటు లో 10వ ర్యాంకు వచ్చినా యూనివర్సిటీ కేంపసు లో సీటు యివ్వరట నాన్నా-- అని చిన్నాడు అంటూంటే ఎంత బాధ పడ్డాననీ.... అప్పుడు అనిపించింది, వీళ్ళని ఎలాగైనా వేరే దేశానికి పంపి చదివించాలని. వాళ్ళ అదృష్టం బాగుండి స్కాలర్‌షిప్పులతోటి అమెరికాలో చదువుకొనే అవకాశాలు వచ్చాయి, వాళ్ళు వెళ్ళిపోయారు. కనీసం వాళ్ళ భవిష్యత్తైనా బాగుంటుందని పంపించేశాను. అది ముమ్మాటికీ తప్పుకాదు. కానీ మరి ఇదేమిటి? రోజురోజుకీ ఇంత దిగాలు పడిపోతున్నాను. సరే, యింట్లోవుంటే, నేనూ, అదీ, బాధపడడం తప్ప వేరే ఏదీ వుండదని, కాసేపు అలా తిరిగి వద్దామని అవధాని మేష్టారింటికి బయలుదేరా.

అవధానిగారిల్లు, మా పక్కవీధిలో వుంది. నేను వెళ్ళేసరికి మాష్టారు గుమ్మందగ్గర కూర్చుని పురుకోన, మామిడాకులతో కుస్తీ పడుతున్నారు. నన్ను చూడగానే....
---రావోయి మూర్తీ, ఏమిటి ఎనిమిది గంటలకే దర్శనం. ఏదైనా విశేషమా?---అన్నారు.
---ఏముంటుందిమేష్టారూ, ఏదో సెలవు కదా, ఏమీతోచక, ఏం చేస్తున్నారో చూద్దామని వచ్చా. ఏదో తోరణం కడుతున్నట్లున్నారు. పండగా? - అనడిగా.
---పండగేమరి. యివాళ మా సుధాకర్ పుట్టినరోజు. వారంక్రితమే గ్రీటింగ్సు పంపించాం. ఈపాటికి అందేవుంటాయి మావాడికి
యింతలో వంటింట్లోంచి పార్వతమ్మగారు హడావిడిగా వచ్చారు.
---ఏంబాబూ, పిల్లలు కులాసా? అంటూ కాఫీ అందించారు.
కాఫీ తాగుతూ, అంతా గమనిస్తున్నాను. వీళ్ళబ్బాయి సుధాకర్ కూడా అమెరికా లోనే వుంటున్నాడు. అతని పుట్టినరోజుకి యిక్కడ వీళ్ళింత హడావిడి చేస్తూంటే ఆశ్చర్యం వేసింది. కొంచెం కుతూహలం కలిగింది.
---మేష్టారూ, మీరేమీ అనుకోకపోతే..నేను యివాళ మీతో గడుపుదామని వచ్చాను - అన్నాను.
---దాందేముందోయ్, కాసేపట్లో బిర్లామందిరానికెళ్ళి మావాడిపేర అర్చన చేయించాలి. యింటికెళ్ళి అమ్మాయిని కూడా తీసుకురా. అందరం కలిసే వెడదాం - అన్నారు మేష్టారు.
అంతా తిరిగి యింటికి చేరేసరికి నాలుగైంది. --నీతో మాట్లాడాలి, సరిగ్గా అయిదుగంటలకల్లా రమ్మని చెప్పి వెళ్ళిపోయారు మేష్టారు. ఎందుకో నాకర్థం కాలేదు. సరిగ్గా అయిదుగంటలకి వెళ్ళాను. ఎంతో ఉత్సాహంగా కనిపించారు మేష్టారు.
---రావోయ్, మేడమీదికెడదాం - అంటూ పైకి దారితీశారు.

---చూడు మూర్తీ, నువ్వు దేనిగురించి ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. పిల్లలగురించేగా నీ ఆలోచన. వాళ్ళని తలచుకొని మీరు, మిమ్మల్ని తలచుకొని వాళ్ళూ బాధపడడం కాదయ్యా యీ సమస్యకి పరిష్కారం. అయినా వాళ్ళెక్కడికి వెళ్ళారని, వొక్కసారి కళ్ళు మూసుకో. కళ్ళయెదుటే కనిపిస్తారు. మనుషులు వొకచోట వుండడం కాదయ్యా ముఖ్యం. వాళ్ళకి మనం, మనకి వాళ్ళూ వున్నామనే తలపుని సజీవంగా వుంచినంతకాలం వాళ్ళెక్కడికీ వెళ్ళలేదనే అర్థం. మామటుకు మాకు, మా సుధాకర్ యెక్కడికీ వెళ్ళలేదు. అందుకే, వాడు యిక్కడ వున్నప్పుడు వాడి పుట్టినరోజు ఎలా జరిపేవాళ్ళమో యిప్పుడుకూడా అలాగేచేశాం. ఇంకోవిషయం. నిన్ను అయిదు గంటలకు యెందుకు రమ్మన్నానో తెలుసా? ఇందాకా మావాడికి పెద్ద వుత్తరం రాశాను. రాసినంతసేపూ వాడితో మాట్లాడుతున్నట్లు, వాడిని కలిసినట్లూ అనిపించింది. అందుకే నాకు యిప్పుడు ఎంతో హాయిగా, సంతోషంగా వుంది. ఇప్పుడు నీ సమస్యకి సమాధానం దొరికిందనుకుంటాను – అన్నారు నవ్వుతూ.

---నిజమే మేష్టారూ, నేనూ ప్రయత్నించాలి – అంటూ శెలవు తీసుకొని యింటికి చేరా.

---మీకు నిన్న లెటర్ వచ్చిందంకుల్ – అంటూ యింటివాళ్ళబ్బాయి వో కవరు అందించాడు.

దస్తూరీ చూసి పోల్చుకున్నా, అది నాన్న రాసిన వుత్తరమని. తీసి చదవసాగా.

---మూర్తినీ, కోడల్నీ ఆశీర్వదించి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. అక్కడ నువ్వూ, కోడలూ క్షేమమని తలుస్తాను. పిల్లలు యెలావున్నారు? వుత్తరాలూ గట్రా రాస్తున్నారా? ఇక్కడికి యెప్పుడు వస్తారుట? ముఖ్యవిషయం. వచ్చే పాడ్యమీ బుధవారం నీ పుట్టినరోజు. ఏదో మాకు తోచింది పంపుతున్నాం. ఛాదస్తమని కొట్టిపారేయక, నువ్వూ కోడలూ బట్టలు కొనుక్కోండి. ఇంకో విషయం. వీలుచూసుకుని ఓసారి యిక్కడికి రండి. అది చూడాలని గోలపెడుతోంది. మిగిలిన విషయాలు మామూలే. వుంటాను.

ఇట్లు,

మీ నాన్న రామభద్రయ్య---

మేష్టారి మాటల్లోనిజం నాకిప్పుడు బోధపడింది.......

వెంటనే కాగితం తీసుకుని పిల్లలకు వుత్తరం రాయడం మొదలుపెట్టా.

*******

జనవరి నెల తెలుగుజ్యోతి లోని సమస్య 5 కు పూరణ :

సమస్య : దుఃఖము లోన మున్గి బహు తోషమునొందెను జానకి సతీ..

పూరణ : రామభద్ర, ఫణికుమార్ డొక్కా, అట్లాంటా, జార్జియా.

ఉత్పలమాల :

లేఖితమాయె నీచరిత లోకములన్నియుఁ జాల మెచ్చవే,
వైఖరి చిత్రమీ జనుల వాక్కును తీర్పుగ నాదరించెనే,
పుంఖితమాయె నన్ను రఘురాముని కీర్తి మయూఖరేఖలన్,
దుఃఖము లోన మున్గి బహు తోషమునొందెను జానకి సతీ..

లేఖితమాయె = లిఖించబడినది,
పుంఖితమాయె = వ్యాప్తినొందెను,
కీర్తి మయూఖ రేఖలు = యశశ్చంద్రికలు

శ్రీరాముని చే వనవాసమునకు పంపబడిన సీతావేదనను వర్ణించే ప్రయత్నం. సీత, లక్ష్మణునితో చెబుతున్నట్లుగా చిత్రీకరించడం జరిగింది.

## ఉగాది

చిగురాటాకులు తెగమెక్కి
మత్తుగ ముద్దుముద్దుగ
గానముచేసే కోకిలలు
చేదుమందుకు అలవాటుపడి
ఉగాది పచ్చడి చేదుకల్లదాయె
మంగళ కరవాగి, మామిడి
తోరణాలు ముంగిట కట్టి
నూతన వస్త్రాలను కట్టి
నీఆహ్వానం నకు ఎదురుచూస్తున్నాయి
త్వరగా కదలిరావమ్మా ఉగాది లక్ష్మి

– దూపాటి శేషుకుమారాచార్యులు

Sarapaka, A.P.